తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మార్చి 2020

## సప్తగిరి అనుబంధం




కరారవిందేన పదారవిందం
ముఖారవిందే వినివేశయంతం ।
వటస్య పత్రస్య పుటేశయానం
బాలం ముకుందం మనసాస్మరామి ॥


తిరుమల తిరుపతి దేవస్థానములు
బ్రహ్మోత్సవాలలో బాలకళాకారులు....

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 మార్చి 2020 సంచిక: 01

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూ దేవుళ్లు | **శ్రీమత్స్యావతారమూర్తి**<br>డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | **పొయ్‌గై ఆళ్వార్**<br>డా॥ కంపల్లె రవిచంద్రన్ | 06 |
| కన్నడహరిదాస వరేణ్యులు | **పురందరదాసు**<br>డా॥ సి.శైలకుమార్ | 08 |
| చిత్రకథ | **మట్టి దళాలంటే మక్కువ!**<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కళారత్న దేవీజీ | 10 |
| బాలనీతి | **మహాత్ములనే ఆశ్రయించాలి!!**<br>డా॥సముద్రాల లక్ష్మణయ్య | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: శ్రీమతి వి.ఉమారాణి | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : వటపత్రశాయి
వెనుక చిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామివారు

భగవంతుడి కృపాకటాక్షంతో ఈ అనంతవిశ్వం సాగుతోంది. ఆ భగవంతుడి విశేషాల్ని ప్రతినెలా 'హిందూ దేవుళ్లు' ధారావాహికలో తెలుసుకుందాం పిల్లలూ...

హిందూ దేవుళ్లు

# శ్రీమత్స్యావతారమూర్తి

- డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

దశావతారాలలో శ్రీమత్స్యావతారం మొట్టమొదటిది. కల్పాంతం వేళ బ్రహ్మదేవుడు నిద్రకు ఉపక్రమించాడు. నిద్రావస్థలో బ్రహ్మదేవుడు నోరు తెరవగా ఆనోటినుంచి జారిపడిన వేదమాతను సోమకుడనే రాక్షసుడు ఎత్తుకుని పారిపోయాడు. ఇది బ్రహ్మ గమనించలేదు కాని సర్వాంతర్యామి అయిన శ్రీమహావిష్ణువు చూచాడు. వేదమాతను సోమ కాసురుని చెరనుండి కాపాడడం కోసం మత్స్యావతారం ఎత్తాడు. కృతమాల అనే నదిలో చిన్న చేపగా అవతరించాడు.


అది సత్యయుగం. సత్యవ్రతుడనే రాజు భూమిని పరిపాలిస్తున్న రోజులవి. ఒకరోజు ఆరాజు కృతమాలలో స్నానమాచరించి సంధ్యవార్చే టప్పుడు అతని దోసిలిలోకి చిన్నచేపగా అవతరించిన శ్రీమహావిష్ణువు వచ్చాడు. "రాజా! నన్నీ నదిలో వదిలివేయకు. పెద్ద పెద్ద చేపలున్నాయి. అవి నన్ను మింగివేయగలవు". అని ఆ చిన్ని చేప సత్యవ్రతుని అర్థిం చింది. సత్యవ్రతుడు ఆశ్చర్యపోయి ఆ చేపను తన కమండలంలో ఉంచు కున్నాడు. మరుసటిరోజుకు ఆచేప కమండలంలో ఇమడలేకపోయింది. పెద్దదైపోయింది. రాజు దానిని బావిలో వదిలాడు. మరుసటిరోజు ఆ చేప మరింత పెద్దదై బావిలో పట్టలేదు.

రాజు దానిని సరస్సులో, నదిలో, చివరికి సముద్రంలో వదలి, "మహానుభావా! మీరెవరు? ఎందుకు నన్ను శోధిస్తున్నారు?" అని ప్రశ్నిం చాడు. అప్పుడు మత్స్యరూపంలో ఉన్న శ్రీమన్నారాయణుడు నవ్వి "రాజా! నేను శ్రీమహావిష్ణువును. మత్స్యరూపమెత్తాను. ఇది కల్పాంత సమయము.

నేటికి ఏడవరోజున జలప్రళయం రానున్నది. నీవు సకలజీవధాతువులను, సప్తర్షులను, వాసుకిని అండగా తీసుకొని ఒక పడవపై నాకోసం వేచి ఉండు. నేను మత్స్యనారాయణుడిగా వచ్చి మిమ్మలనందరినీ రక్షిస్తాను. రానున్నది చక్షుష మన్వంతరం. కాబోయే మనువు నీవే!" అని చెప్పాడు.

దానికి సత్యవ్రతుడు మహాప్రసాదమని పలికి సప్తర్షులను రప్పించి వారికి దైవోపదేశం విన్పించి సకల జీవధాతువులతో పడవను ఎక్కి వాసుకి తోడుగా నారాయణుడి కోసం ఎదురు చూడసాగాడు.

ఏడవరోజున కల్పాంత ప్రళయం వచ్చింది. శ్రీమత్స్యనారాయణుడు తన కొమ్ముతో వాసుకిని పట్టుకోగా వాసుకి తన తోకతో పడవను చుట్టుకుంది. స్వామి తీసుకెళుతున్న దిశగా సత్యవ్రతుడు, సప్తర్షులు, సకల జీవధాతువులతో సహా కదిలిపోతున్నారు. ఏడు రోజులపాటు సాగిన ఆ ప్రయాణంలో శ్రీమహావిష్ణువు సప్తర్షులకు, సత్యవ్రతుడికి మత్స్య పురాణం విన్పించాడు. ఏడవరోజున ఆ రాక్షసుడు పెద్దగా అరుస్తూ రాగా శ్రీమత్స్యావతారమూర్తి వానిని వధించి వేద మాతను బ్రహ్మదేవుని చెంతకు చేర్చాడు. క్రమంగా చక్షుష మన్వంతరం మొదలైంది. పునఃసృష్టి ప్రారంభమైంది. అవతార లక్ష్యం ఈడేరింది. నీటిపాలైన వేదాలను జలాలలో సంచరించే మత్స్యమై రక్షించిన కరుణామూర్తి శ్రీమన్నారాయణమూర్తి. ఇదీ మత్స్యనాథుని అవతార విశేషం!



నిరంతరం భగవద్ధ్యానంలో మునిగితేలినవారు ఆళ్వార్లు. ఇహపర సాధనకు భక్తివినాసన్మార్గం లేదని నిరూపించిన దివ్యమూర్తులు ఆళ్వార్లు. ఈ పరమభాగవతోత్తములు ఎన్నితరాలు మారినా మార్గదర్శకంగానే నిలుస్తారు. వీరు 12 మంది. వీరిని భవిష్యత్తరాలకు పరిచయం చేయడమే ఈ 'పన్నిద్దరాళ్వార్లు' ధారావాహిక ముఖ్యఉద్దేశం!

పన్నిద్దరాళ్వార్లు

# పొయ్‌గై ఆళ్వార్


- డా॥ కంపల్లె రవిచంద్రన్

దక్షిణభారతదేశంలో 'కాంచీపురం' ప్రసిద్ధపుణ్యక్షేత్రం. ఇక్కడ ఎన్నో ఆలయాలున్నాయి. వాటిలో 'తిరువెక్కా' ఒకటి. ఈ క్షేత్రం ఉత్తర భాగంలోని పరమపావనమైన తామరకొలనులో పొయ్‌గై ఆళ్వార్ జన్మించారు. వీరు పుట్టింది తులామాసం, శ్రావణనక్షత్రం.

వీరి బాల్యంగురించి మనకు తెలిసిన అంశాలు చాల తక్కువే! శ్రీమహావిష్ణువు సేనానులైన విష్వక్సేనులు వీరికి పంచసంస్కారాలు పూర్తి చేసి మూలమంత్రం ఉపదేశించారు. పంచసంస్కారాలన్నీ వైష్ణవచిహ్నాలు. పుట్టుకతో వైష్ణవుడైనా సరే ఈ చిహ్నాలతోనే శ్రీవైష్ణవుడు అవుతాడు.

ఆళ్వారులు విచ్చేసి భక్తితో సేవించి కీర్తించిన క్షేత్రమే దివ్యదేశం. అలాంటివి 108 ఉన్నాయి. పొయ్‌గై ఆళ్వార్ ఒకసారి దేశసంచారం చేస్తూ తిరుక్కోవలూర్ చేరారు. మృకండు మహర్షి ఇంటి అరుగుపై విశ్రమించారు. ఈలోగా పూదత్తాళ్వార్ వచ్చారు. మొదటి ఆళ్వార్ వారికి నమస్కారం చేశారు.

ఈ అరుగుపై ఒకరు పడుకోవచ్చు. ఇద్దరు కూర్చోవచ్చు. ఈ లోగా 'పేయాళ్వార్' వచ్చారు. ఇద్దరు ఆళ్వారులు అభివందనాలు చేశారు. ఈ అరుగులో ఒకరు పడుకోవచ్చు. ఇద్దరు కూర్చోవచ్చు. ముగ్గురు నిలబడవచ్చని వారు పేయాళ్వారు ఆహ్వానించారు. సత్కథాప్రసంగంతో కాలం గడచిపోతూ ఉంది. త్రివిక్రముడైన నారాయణుడు వీరిని అనుగ్రహింపదలచాడు పెనుగాలితోడి వాన మొదలైంది. అరుగు మీదున్న



ఆళ్వార్లు అట్టే నిలుచున్నారు. అయితే, వారి మధ్య తీవ్రమైన ఒత్తిడి మొదలైంది. అరుగు మీద ముగ్గురుగాక మరెవరో ప్రవేశించినట్లు వారికర్థమైంది. ఆ సమయంలో వారి ముందు ఒక 'వెలుగు' కనిపించింది. ఆ వెలుగును చూచి పొయ్‌గై ఆళ్వార్ ఒక పాశురం పాడారు.

పాశురమంటె సంగీతంతో కూడిన పద్యమని సామాన్య అర్థం. ఆ పాశురం తమిళం. ఆ పాశురం భావం– "భూమి ప్రమిద. చుట్టూ ఉన్న జలమే నెయ్యి. ఎక్కడో ఉన్న సూర్యుడే దీపం. ఆ వెలుగుకు చక్రధారి అయిన స్వామికి, ఆయన చరణాలకు సూక్తిమాలను సమర్పించాను" అని అన్నారు.

అలాగే పూదత్తాళ్వార్, పేయాళ్వార్లు పాశురాలు పాడారు. ఒత్తిడి మాయమైంది. అరుగుపెరిగి గర్భగుడిలా కనబడింది. స్వామివారు ఆ ముగ్గురికీ దృగ్గోచరుడయ్యాడు. ఆపై ఆళ్వారులు స్వామివారి రూపలీలా విభవకీర్తనలు చేసుకుంటూ బయలుదేరారు. చివరకు స్వామిలో కలసిపోయారు.

తెలుగులో పదకవులవలె కన్నడంలో హరిదాసులు సుప్రసిద్ధులు. వీరు పరమ భాగవతోత్తములు. వీరి గురించి నేటితరం పిల్లలకు తెలియవలసిన అవసరం ఎంతో ఉంది. కనుక, సుప్రసిద్ధులైన హరిదాసులను పిల్లలకు పరిచయం చేయాలని **'కన్నడహరిదాసవరేణ్యులు'** అనే ధారావాహికను ప్రారంభిస్తున్నాం!

కన్నడ హరిదాస వరేణ్యులు

# పురందరదాసు


- డా॥ సి.శైలకుమార్

దాససాహిత్యానికి చాలా ప్రాచుర్యం కలిగించిన వ్యాసరాయల వారి ప్రియశిష్యులు పురందరదాసు. జీవితంలో జరిగిన చిన్న సంఘటన పురందరదాసు జీవితవిధానాన్ని మార్చేసింది. భక్తిజీవితానికి అంకురార్పణ చేసింది. కర్ణాటక సంగీతరంగానికే పితామహుణ్ణి చేసింది.

ఏడుకొండలవాని అనుగ్రహంతో జన్మించిన బిడ్డకు శ్రీనివాస నాయకుడు అని పేరు పెట్టి 'శీనప్ప' అని ముద్దుగా తల్లిదండ్రులు పిలిచేవారు. ఉద్దండులైన పండితులవద్ద సంగీతంతో పాటు సంస్కృతాన్ని కూడా నేర్చుకొని, 16 ఏళ్ళకే మంచి పాండిత్యం సంపాదించాడు. ఈ వయస్సులోనే సరస్వతీబాయితో వివాహం జరిగింది. తండ్రి మరణంతో వ్యాపారనిర్వహణ బాధ్యతను తీసుకున్న శీనప్ప కొద్దికాలంలోనే ఆస్తిని పదింతలు పెంచి 'నవకోటి నారాయణుడు' అనిపించుకున్నాడు. కానీ, లోభగుణాన్ని కూడా పెంచుకొని, పరమపిసినారిగా పేరు తెచ్చుకున్నాడు. లోభి అయిన అతనిమనసు దానధర్మాల నుండి దూరమైపోయింది.

దాంతో, భగవంతుడు ఆయనకు గుణపాఠం నేర్పి, మంచి మనసును ప్రసాదించాలని అనుకున్నాడు. భగవంతుడు తలచుకుంటే అవతారాలకేమి కొదువ? తాను వృద్ధబ్రాహ్మణవేషం ధరించి, బ్రహ్మను కుమారునిగా చేసుకుని, అతని ఉపనయనం నిమిత్తం విరాళం ఇవ్వమని కోరాడు. ఇచ్చే ఉద్దేశం లేని శీనప్ప అతణ్ణి మర్నాడు రమ్మన్నాడు. ఇలా ఎన్నిరోజులు తిరిగినా ఇదే సమాధానం రావడంతో ఆ బ్రాహ్మణుడు సరస్వతీబాయివద్దకు వెళ్లి యాచించాడు. సహజంగా దానగుణం గల

సరస్వతీబాయి, తన భర్త ప్రేమకానుకగా ఇచ్చిన ముక్కరను బ్రాహ్మణునికి ఇచ్చి, దాన్ని అమ్మి, సొమ్ము చేసుకొని ఉపనయనం జరిపించమని చెప్పి పంపింది. కపటనాటకసూత్రధారి అయిన స్వామి ఆ ముక్కర తీసుకుని వెళ్లి, శీనప్పకే అమ్మజూపాడు. శీనప్ప ఆరితేరిన రత్నాలవ్యాపారి కనుక, ఆ ముక్కరకు ఉన్న రత్నాన్నిబట్టి ఆ ముక్కర తన భార్యదే అని గ్రహించాడు. దాంతో ఆ బ్రాహ్మణుణ్ణి అక్కడే నిలబెట్టి, వెంటనే ఇంటికి వచ్చి, తన భార్యను ముక్కర తెమ్మని ఆజ్ఞాపించాడు. దిక్కుతోచని సరస్వతీబాయి తన భర్త ఎక్కడ కోప్పడతాడో అని భయపడి, ప్రాణత్యాగం చేయాలని నిర్ణయించుకుంది. ఆక్షణంలో దీన జనబాంధవుడైన ఆ శ్రీహరి సరస్వతీబాయికి ముక్కరను ఇచ్చి ఆపద గట్టెక్కించాడు.




ఆమె ఆ ముక్కరను శీనప్పకు ఇచ్చింది. ఆయన ఆశ్చర్యంతో దైవమాయ అని గ్రహించి, ఆ క్షణంనుంచే తన మనసును మంచివైపు మార్చుకున్నాడు. అతనికి కొత్త జన్మ ఎత్తినట్లు అయ్యింది. పశ్చాత్తాపహృదయంతో వైరాగ్యాన్ని అలవరచుకుని, అంతవరకు భగవంతునికి, తనకు మధ్య అంతరాన్ని కలిగించిన సంపదను గడ్డిపోచగ భావించి, పరిత్యజించాడు. నాటినుండి శీనప్ప పదాలు పాడుకొంటూ దేశసంచారం మొదలుపెట్టాడు. తన సంచారంలో పురందరదాసు వృద్ధుడైన అన్నమాచార్యవారిని తిరుమల క్షేత్రంలో కలుసుకున్నాడు. క్రీ.శ.1525లో అంటే తన 40వ ఏట ప్రసిద్ధ మధ్వమత గురువులు, మహాపండితులు అయిన వ్యాస రాయస్వామివారి నుండి ఉపదేశం పొందారు.


'పురందర విఠ్ఠల' అనే ముద్రతో కీర్తనలు రచించి,ప్రజలలో భక్తిని ప్రచారం చేశాడు కనుక, శీనప్ప **'పురందరదాసు'**గా స్థిరపడ్డాడు.

# మట్టి దళాలంటే మక్కువ !

చిత్రకథ


కథ : డి. శ్రీనివాస దీక్షితులు
చిత్రాలు : కళారత్న దేవీజీ

శేషాచలానికి ఉత్తరంగా కురువపురం అనే చిన్న గ్రామం ఉంది. అక్కడ నిరుపేద కుమ్మరి భీముడు నివసిస్తున్నాడు. శ్రీ వేంకటేశ్వర స్వామి పాకశాలకి కావలసిన మట్టి కుండల్ని చేసి, భక్తితో సమర్పించడం భీముని నిత్యకృత్యం. ఒకరోజు....












కొండకి వెళ్లలేక పోవడంతో స్వామి ప్రతిమను మట్టితో తయారుచేసుకొని, తులసీదళాలను కూడా మట్టితోనే తయారు చేసి, వాటితో స్వామిని పూజిస్తూ తృప్తి పడుతున్నాడు భీముడు. అతని భార్య తమాలి అతనికి అన్నివిధాలా సహకరిస్తూ వుండటంతో, విసుగు విరామం లేకుండా కుండలు చేస్తూనే ఉన్నాడు భీముడు.


4
రోజూ కొండకి వెడదామనుకుంటున్నాం ! కానీ, ఈ కుండల మూలంగా ఆగిపోతున్నాం...
అలా అనబోకే తమాలీ ! మనం కుండల్ని పంపకపోతే స్వామికి నైవేద్యం ఆగిపోదూ...
5
ఇప్పుడేమయిందిలే... నా స్వామి ఇక్కడే ఉన్నాడు, నా మట్టి తులసీదళాల్ని స్వీకరిస్తాడు. నేను పేదవాణ్ణి... నాకింతకంటే శక్తిలేదు... !
సర్లే... పొద్దెక్కుతోంది. త్వరగా పని పూర్తి చెయ్యి...
ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న తొండమాన్ చక్రవర్తి ఆనందనిలయంలో స్వామి అనుగ్రహం కోసం నిత్యమూ బంగారు తులసీదళాలతో పూజ చేస్తున్నాడు. ఒకనాడు చక్రవర్తి సమర్పించిన బంగారు తులసీదళాలు పక్కకి తొలిగి, మట్టితో చేసిన తులసీదళాలు వచ్చి చేరసాగాయి. రాజు ఆశ్చర్యపోయి....
6
స్వామీ... నేను నీకు పరమ భక్తుణ్ణి కదా ! నా బంగారు దళాల కంటే, ఈ మట్టి దళాలే నీకు ఎక్కువయ్యాయా ?
అవును తొండమానూ... నీ బంగారు దళాలకన్నా నాకు పేదవాడి మట్టి దళాలమీదే మక్కువ ఎక్కువ !
7
ఎందుకు ?
అతనిలో అహంకారం లేదు ! ఆర్తి వుంది...


8
స్వామీ ! ఎవరా భక్తుడు ?
భీముడు అనే కుమ్మరి. నాకు పరమ భక్తుడు !
క్షణంలో చక్రవర్తి అహంకారం పటాపంచలైంది. వివేకం మేలుకొంది,... వినయం వచ్చి చేరింది.
9
స్వామీ ! ఆ మహా భక్తుణ్ణి నాకు చూపించవా ?
తప్పకుండా చూద్దువుగానీ పద !...
స్వామితో కలిసి తొండమానుడు కురువపురానికి వెళ్ళాడు. అక్కడ భీముడు అతని భార్య, పరమానందభరితులయ్యారు.
10
స్వామీ ! నీకు మా నమస్కారం. మేము మట్టి మనుషులం... మాకు, భక్తి, పూజలు ఇవేవీ తెలియవు ! నీకు తగ్గట్టుగా ఏమీ చేయలేము...
భీముడూ ! నిర్మలమైన నీ మాటలు నాకు నచ్చాయి. నువ్వు నా పరమ భక్తుడివి. నువ్విచ్చే మట్టిదళాలే ఆనంద నిలయంలో నాకు చేరుతున్నాయి.
11
తమాలీ ! నాకు బాగా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా పెట్టవా ?
క్షణంలో స్వామీ...
వెంటనే కొత్త కుండలో జొన్న సంగటి కాచి తెచ్చి, స్వామికి ఇచ్చింది తమాలి.
12
సంగటి చాలా రుచిగా ఉంది. మీకేం కావాలో కోరుకోండి...
నీ దర్శనం అయింది ! మాకంతే చాలు...




దివ్య విమానం వచ్చి ఆ దంపతుల ముందు వాలింది. శ్రీ వేంకటేశ్వర స్వామికి నమస్కరించి, కుమ్మరదాసుగా కీర్తినిపొందిన భీముడు, భార్య తమాలితో కలిసి విమానంలో ఎక్కి శ్రీ వైకుంఠానికి వెళ్ళిపోయాడు.




శ్రీ వేంకటేశ్వర స్వామితో కలిసి తొండమాన్ చక్రవర్తి ఆనంద నిలయానికి పయనమయ్యారు.

**వచ్చే సంచికలో శ్రీ వేంకటేశ్వరుని మరో దివ్య లీలా విలాసాన్ని దర్శించి తరిద్దాం !**

స్వస్తి




# మహాత్ములనే ఆశ్రయించాలి!!

– డా॥సముద్రాల లక్ష్మణయ్య

నీచాశ్రయో న కర్తవ్యః
కర్తవ్యో మహదాశ్రయః।
ఈశాశ్రయో మహానాగః
పప్రచ్ఛ గరుడం సుఖమ్॥


ఒక వ్యక్తి తనకు తానుగా అన్ని సందర్భాలలోనూ ఏ విధమైన చిక్కులూ, అలజడులూ లేకుండా జీవించలేడు. క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు తనకంటే గొప్పవాడైన మరొక వ్యక్తిని ఆశ్రయించి అతని సహాయంతో కష్టాలనుండి గట్టెక్కుతాడు. ఇది లోకస్థితి.

అలా మరొక వ్యక్తిని ఆశ్రయించవలసి వచ్చినప్పుడు మహనీయుడైన గొప్పవాణ్ణి ఆశ్రయించాలే కాని నీచుణ్ణి ఆశ్రయించరాదు అని పై శ్లోకం బోధిస్తున్నది.

అది ఒక కొండ. ఆ కొండమీద ఒక సర్పం ఉన్నది. ఒకనాడు అది ఆ పర్వతం మీద అటూ ఇటూ తిరుగుతూ ఉన్నది. ఇంతలో ఆకాశంలో పయనిస్తూ గరుడుడు ఆ పామును సమీపించాడు.

అలాంటి స్థితిలో మామూలు పాము అయితే, ఆత్మ రక్షణకై ఏ కలుగులోనో దూరడానికి ప్రయత్నించి ఉండేది. కాని, ఆ సర్పం అలా చేయలేదు.

పైగా, గరుడుణ్ణి చూచి, 'ఏమి మిత్రమా! కుశలమా?' అని ప్రశ్నించింది. గరుడుడు కూడా 'ఆఁ! కుశలమే! నీకూ క్షేమమే కదా?' అని ప్రతి ప్రశ్న వేశాడు.



ఇద్దరూ ఇలా పరస్పరం కుశలప్రశ్నలు వేసుకొని నవ్వుకుంటూ తమ దారిన తాము వెళ్లారు.

ఇది ఎలా జరిగింది అని మనకు ఆశ్చర్యం కలుగవచ్చు. అసలు సంగతి ఇది –

ఆ కొండ కైలాసం.

ఆ సర్పం శివుని మెడలో ఆభరణమైన మాల.

ఆ దినం విహారానికై వచ్చి అది గరుడుని కంటబడింది. మహా మహుడైన శివుణ్ణి ఆశ్రయించడంవల్ల ఆ సర్పానికి గరుడుడు ఏ విధమైన హానీ కల్గించలేకపోయాడు.

**కాబట్టి, మహాత్ములను ఆశ్రయించాలే కాని, నీచులను ఆశ్ర యించరాదు అని ఈ నీతిశ్లోకం బోధిస్తున్నది.**



# విశిష్టబాలుడు

**తి**రుపతికి చెందిన శ్రీ పి.నాగేశ్వర్, శ్రీమతి పద్మావతి దంపతుల కుమారుడు **హేమవెంకట్ నారాయణ**(9వ తరగతి) భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా ఆలాపన చేస్తూ ఆధ్యాత్మిక పండితులను సైతం అబ్బుర పరుస్తున్నాడు. విష్ణుసహస్రనామాలను ఏకధాటిగా వల్లిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఈ చిన్నారిలోని ప్రతిభకు ఎన్నో ప్రతిభాపురస్కారాలు లభించాయి.

## ప్రతిభకు బహుమతులు

- 2012లో వర్డ్స్ వర్త్ ఇంటర్నేషనల్‌వారు నిర్వహించిన స్పెల్లింగ్ బీ పోటీల్లో మొదటి బహుమతి.
- 2012లో ప్రసారభారతి వారు విష్ణుసహస్రనామ పారాయణం రికార్డు చేసి ప్రసారం చేసి ప్రశంసించారు.
- 2012లో వేదిక్ యూనివర్సిటీలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలో మొదటి బహుమతి.
- 2013లో సంస్కృతభారతివారు నిర్వహించిన భగవద్గీత కంఠపాఠ పరీక్షలో మొదటి బహుమతి.
- 2013లో శ్రీవేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీవారు సంస్కృత దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలో ద్వితీయ బహుమతి.
- 2013లో శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మొదటి బహుమతి.
- 2016లో రాజమండ్రిలో జరిగిన ఘంటశాల ఆరాధనోత్సవాలలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నాడు.
- 2014 నుండి 2018 వరకు ప్రతి సంవత్సరం శ్రీకృష్ణజన్మాష్టమి, గీతా జయంతిసందర్భంగా ఇస్కాన్‌లో నిర్వహించిన పోటీల్లో మొదటిబహుమతి.
- 07-12-19న హెచ్.డి.పి.పి., తి.తి.దే. & ఇస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో గీతాజయంతి ఉత్సవాలు జరిగాయి. ఇందులో పాల్గొని తి.తి.దే. ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి చేత ప్రథమ బహుమతిని అందుకున్నాడు.
- 07-12-2019న చిన్మయమిషన్ జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి అర్హుడు అయ్యాడు.

**మన హైందవసంస్కృతికి వారసులైన పిల్లలలో పురాణ, ఇతిహాస, కావ్యపరిజ్ఞానం పెంపొందించేందుకు ప్రతినెలా 'క్విజ్' అందిస్తున్నాం.**

# క్విజ్

నిర్వహణ-
శ్రీమతి వి.ఉమారాణి

**1) తిరుమలేశుని దర్శనానికి ముందు ఏ దేవుణ్ణి దర్శించాలి?**

అ) వాసుదేవుడు ఆ) వామనుడు
ఇ) వరాహస్వామి ఈ) వేంకటేశ్వరస్వామి

**2) సతీసావిత్రి భర్త?**

అ) సత్యవ్రతుడు ఆ) సత్యవంతుడు
ఇ) సత్యకీర్తి ఈ) సత్యమూర్తి

**3) శకుంతల పెంపుడు తండ్రి?**

అ) కణ్వమహర్షి ఆ) మృకండమహర్షి
ఇ) భృగుమహర్షి ఈ) అత్రిమహర్షి

**4) మహాభారతంలో పర్వాలు ఎన్ని?**

అ) పదకొండు ఆ) పన్నెండు
ఇ) పద్దెనిమిది ఈ) ఇరవైఎనిమిది

**5) శ్రీపద్మావతీఅమ్మవారు వెలసిన క్షేత్రం?**

అ) శ్రీనివాసమంగాపురం ఆ) అలమేలుమంగాపురం
ఇ) నారాయణవనం ఈ) నాగులాపురం

**6) ఆంధ్రభోజుడు ఎవరు?**

అ) మహాకవి కాళిదాసు ఆ) శ్రీకృష్ణదేవరాయలు
ఇ) భోజరాజు ఈ) త్యాగరాజు

**7) శ్రీవారి 'ముత్యాలహారతి' ఎవరు ప్రారంభించారు?**


అ) అన్నమయ్య ఆ) పెదతిరుమలయ్య
ఇ) తాళ్లపాక తిమ్మక్క ఈ) తరిగొండవెంగమాంబ

**జవాబులు**

1) ఇ 2) ఆ 3) అ 4) ఇ 5) ఆ 6) ఆ 7) ఈ

# చిత్రలేఖనం

## ఈ బొమ్మకు రంగులు వేద్దామా...



## పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...


తిరుమల తిరుపతి దేవస్థానములు
బాలభక్తుడు....



నిత్యాత్ముడై యుండి
నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి
సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి
బ్రహ్మమై యుండు
సంస్తుత్యుడీ
తిరువేంకటాద్రివిభుడు

– అన్నమయ్య